# వైరస్

## - గవర ఈశ్వరరావు

రాజధానిలో ప్రముఖ స్టూడియోలో అదొక ఫ్లోర్.

డైరక్టర్ రాణా షూటింగ్‌లో చాలా బిజీగా వున్నాడు.

ఉదయం నుంచీ ఒకటే హడావుడి.

టెన్షన్... టెన్షన్‌గా వుంది.

అదే చివరి షెడ్యూల్. అందులోనూ క్లైమాక్స్!

అది పూర్తయిపోతే ఇక వచ్చేనెలలో సినిమా రిలీజ్.

షూటింగ్ ప్రారంభంరోజునే రిలీజ్ డేట్‌ను కూడా ప్రకటిస్తాడు రాణా.

అదే అతనిలో వున్న ధైర్యం, ఆత్మవిశ్వాసం.

అందుకే ఆ రంగంలో వారంతా రాణాని మెచ్చుకుంటారు.

డైలాగ్ రైటర్‌తో డిస్కస్ చేస్తూనే అసిస్టెంట్ దర్శకుడికి సూచనలిస్తున్నాడు. మరోపక్క కెమెరామెన్‌ని కెమెరా మూవ్‌మెంట్‌కు సంబంధించిన సలహా చెప్తున్నారు. ఒక విధంగా అష్టావధానం చేస్తున్నాడు రాణా.

ఆ క్షణంలో అతడొక అలుపెరుగని శ్రామికుడిలా– విశ్రాంతి ఎరుగక నిరంతరం శ్రమించే కర్షకుడిలా కనిపిస్తున్నాడు ఆ యూనిట్ అంతటికీ.

ఇప్పుడతనికి అది ఎనిమిదవ సినిమా!

ఇంతకుముందు తీసిన ఏడు సినిమాలు కూడా సూపర్ డూపర్ హిట్స్.

రాణా ఇప్పటివరకు తీసిన అన్ని సినిమాల్లోనూ కాలేజీ బ్యాక్‌డ్రాప్ ఉంది. యూత్ ఓరియెంటెడ్ సినిమాలే చేస్తాడు.

తీసినవి అతి తక్కువ సినిమాలే. కానీ యూత్‌ని బాగా ఆకట్టుకున్నాడు. తెలుగు సినీ చరిత్రలో అతడు సాధించిన రికార్డులు ఎవరూ సాధించలేదు. తన రికార్డులను తనే అధిగమించుకుంటాడు.

అది అందరికీ సాధ్యంకాదు.

ఇప్పుడతనితో సినిమాలు తీసేందుకు ఎందరో నిర్మాతలు సిద్ధంగా వున్నారు. అతడిచ్చే డేట్స్ కోసమే ఎదురుచూస్తున్నారు.

ప్రేమని ఒక కొత్త కోణంలో చూపిస్తూ యువతరాన్ని బాగా ఆకట్టుకున్నాడు.

అందువల్లనే అనతికాలంలోనే ఆకాశమంత ఎత్తుకెదిగి ఎనలేని కీర్తి ప్రతిష్టల్ని సంపాదించుకున్నాడు.

కాలేజీ కుర్రాళ్ళు అతని సినిమా కోసం ఎదురు చూస్తూ వుంటారు. కేవలం ఏడు సినిమాలతోనే యువతరం హృదయాల్ని కొల్లగొట్టాడు.

అసలు రాణా సొంత వూరు విశాఖ జిల్లాలోని నర్సీపట్నం. పుట్టింది, పెరిగింది, చదువుకున్నది అంతా అక్కడే. ఇంటర్మీడియెట్ తరువాత కొన్నాళ్ళు ఖాళీగా తిరిగాడు పైసా సంపాదన లేకుండా!

తన బ్రతుకే తనకు భారంగా వుంటే ఇంట్లో వాళ్ళు పెళ్లి పేరుతో మరొకర్ని తగిలించారు.

ఆ తరువాత ఉద్యోగం మిషతో హైదరాబాద్ వెళ్లిపోయాడు ఒంటరిగా.

మామూలుగానే రాణాకి సినిమాలంటే చాలా ఇష్టం. ఇంకో విధంగా చెప్పాలంటే పిచ్చి. అందుకే ఒక ప్రముఖ దర్శకుడి కాళ్లావేళ్లాపడి అసిస్టెంట్‌గా జాయినయ్యాడు.

అతి తక్కువ సమయంలోనే చిత్రానువాదం, దర్శకత్వంలోని మెళకువలన్నిటినీ నేర్చుకున్నాడు.

ఇతడి ప్రతిభని గమనించి ఒక ప్రముఖ నిర్మాత సినిమా అవకాశమిచ్చాడు.

రాణా జీవితంలో అదొక ముఖ్యమైన మలుపు. అక్కడ్నుంచే ఎన్నో మైలురాళ్ళను విజయవంతంగా దాటి విశ్వవిఖ్యాతి సంపాదించాడు. తెలుగు సినీచరిత్ర గతిని మార్చాడు.

ప్రేమకు కొత్త భాష్యం చెప్పాడు. స్నేహానికి సరికొత్త ప్రవచనం పలికాడు. శృంగారాన్ని ఒక సరికొత్త కోణంలో ఆవిష్కరించాడు.

యువతరంలో మంచి క్రేజ్ సంపాదించాడు. అంతకుమించి ఎంతో ఫాలోయింగ్ కూడా.

సరిగ్గా స్లంప్‌లో సినీరంగంలో అతడి [illegible] ఉత్ప్రేరకంలా పనిచేసింది. నిస్తేజంగా వున్న [illegible] ఉత్తేజంగా ఊపందుకుంది. అన[illegible] ముందుకు కదిలింది.

యువత చుట్టూ పరిభ్రమించే కథలకి గిరాకీ పె[illegible]గింది.

కాలేజీ బ్యాక్‌డ్రాప్‌తో ఎన్నో సినిమాలు తయా[illegible]య్యాయి.

కొంతమంది ప్రముఖులయితే తెలుగు సినీ పరిశ్ర[illegible]మని రాణాకి ముందు రాణాకి తరువాత అంటూ విభజించి పుస్తకాలు కూడా పబ్లిష్ చేసారు.

దటీజ్ రాణా!

ఇప్పుడు షూటింగ్ జరుగుతున్నది ఎనిమిదవ పిక్చర్. ఇంక అదెన్ని రికార్డుల్ని సృష్టిస్తుందో! ఎంత కనకవర్షం కురిపిస్తుందో!

పరిశ్రమ కళ్లన్నీ ఆ సినిమా మీదే.

క్లైమాక్స్ షూటింగ్ తరువాత రషెస్ చూసి ఎడిటింగ్, మిక్సింగ్, డబ్బింగ్... ఆ తరువాత రిలీజ్.

సాధారణంగా రాణా సినిమాతో పోటీగా ఏ నిర్మాత తన సినిమాల్ని రిలీజ్ చేయడు.

ఒక విధంగా అతడంటే గౌరవం, అంతకుమించి భయం ఒక వారం పదిరోజులవరకూ ఓపెనింగ్స్ ఉండవని.

సరిగ్గా సమయం మధ్యాహ్నం ఒంటిగంట అయింది. లంచ్ బ్రేక్ చెప్పాడు.

షూటింగ్ స్పాట్‌లోనే లంచ్ ఏర్పాటు చేసారు.

అంతా హడావుడిగా ఉంది.

అప్పుడే రాణా జేబులోని సెల్‌ఫోన్ రింగయింది.

వెంటనే తీసి చెవికానించి ఆన్సర్ చేసాడు.

ఫోన్ మాట్లాడుతున్న రాణా ముఖంలో ఏదో ఆదుర్దా, టెన్షన్!

తిరిగి ఫోన్‌ని జేబులో పెట్టుకున్నాడు.

ఎడమ చేతిని నుదుటిమీద పెట్టుకుని బాధగా వెనక్కి వాలాడు.

వెంటనే అసిస్టెంట్ డైరెక్టర్, నిర్మాత దగ్గరకు వచ్చాడు.

రాణా కళ్ళు తెరిచి చూసాడు.

''రాజూ! ఇవాల్టికి పేకప్ చెప్పేయండి. మా సొంత ఊర్లోని మా అంకుల్ చనిపోయాడని ఫోన్ వచ్చింది. ఈవాళే మా ఫేమిలీ మొత్తం అక్కడికి వెళ్లాలి.''

అర్థమైనట్లు తలూపాడు అసిస్టెంట్ డైరెక్టర్ రాజు. ఆ వెంటనే ప్రొడక్షన్ మేనేజర్‌కి కబురు పెట్టాడు.

క్షణాలమీద ప్రొడక్షన్ మేనేజర్ రెడ్డి అక్కడికి వచ్చాడు.

రాణా విషయమంతా చెప్పాడు.

''మళ్లీ నేను ఊరునుంచి రాగానే ఫోన్ చేస్తా.''

''అలాగే'' నంటూ తలాడించాడు.

డ్రైవర్ కారు తెచ్చి ఎదురుగా ఆపాడు.

అసిస్టెంట్ వెంటనే డోర్ తీసాడు.

రాణా కారులో కూర్చోగానే కారు ముందుకు కదిలింది.

కారుతోపాటుగా అతని ఆలోచనలు కూడా.

అసలేం జరిగింది? అసలెందుకిలా జరిగింది?

తన ముద్దుల కూతురు, గారాలపట్టి లహరి ఎందుకిలా చేసింది?

ఎవరితోనో లేచిపోయి గుడిలో పెళ్లి చేసుకుందిట?

ఫీల్డులో ఎవరైనా వింటే నవ్విపోరూ?

ఇంత కష్టపడి సంపాదించుకున్న పేరు ఒక్క క్షణంలో పోదూ!

అందుకే తను విషయాన్ని మార్చి చెప్పాడు తన యూనిట్ సభ్యులకి.

ఒక్కసారిగా తన కూతురుమీద పీకలవరకూ కోపం వచ్చింది.

ఎక్కడ తప్పు జరిగింది?

లహరి చదువుతున్నది ఉమెన్స్ కాలేజీలో. కో ఎడ్యుకేషన్ కూడా కాదు.

కాలేజీకి బస్‌లోనే వెళ్తుంది, అందులోనే తిరిగి వస్తుంది.

కీర్తికాంక్షతో డబ్బు సంపాదనలో పడి తన కుటుంబాన్ని పట్టించుకోవడం మానేసాడు. తను తీసే సినిమా షూటింగ్ ప్రారంభమైతే ఇక ఆ రోజు నుంచి కంటిమీదకు నిద్రరాదు. అన్నం సహించదు. నిరంతరం మెదడు ఆలోచనలతో నిండిపోతుంది. ఏ క్షణంలో ఇంటికొచ్చి మళ్ళీ ఏ క్షణంలో వెళ్లిపోతాడో తనకే తెలీదు. సినిమా షూటింగ్ తనకొక యజ్ఞం. అదొక తపస్సు తనకి!

కారు ఇంటి ముందు ఆగింది.

గబుక్కున దిగి వడివడిగా ఇంట్లోకి వెళ్లాడు రాణా.

భార్య అంజనీ హాల్లోని సోఫాలో తల వెనక్కి వాల్చి కూర్చునుంది.

రాణా వెళ్లి ఆమె పక్కనే కూర్చున్నాడు.

అంజనీ కళ్ళు తెరిచి చూసింది. కళ్లనిండా నీళ్ళే!

తనక్కూడా దుఃఖం పొంగుకొచ్చింది.

''అసలేం జరిగింది?''

''ఎవరో చంద్రం అట! తనకి బస్‌స్టాప్‌లో పరిచయమయ్యాడని చెప్పింది. ఎప్పటినుంచో లవ్ చేస్తోందిట. మనకి చెప్తే పెళ్లికి ఒప్పుకోమని గుడిలో ఇద్దరూ పెళ్లి చేసుకుని ఆ తరువాత రిజిస్టర్ చేయించుకున్నారట. ఇప్పుడే ఫోన్‌లో చెప్పింది విషయమంతా. పేదింటి అబ్బాయిట. డిగ్రీ చదువు. ఎలాగైనా కష్టపడి పోషిస్తాడని చెప్పింది. మన నుంచి పైసా కూడా ఆశించనని చెప్పింది.''

ఉబికి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక భోరున ఏడుస్తూ రాణా ఒడిలో వాలిపోయింది.

రాణాకి కూడా గుండెలో దాక్కున్న బాధంతా ఎగదన్నుకొచ్చింది. అయినా నిభాయించుకున్నాడు.

తనేడిస్తే అంజని మరింత భయపడి బెంగపెట్టు





## అందం

''అబ్బా! తాగడంవల్ల నువ్వు ఎంత అందంగా కనిపిస్తున్నావే?'' అన్నాడు భర్త.

''అయ్యో! నేను తాగలేదండీ!'' అంది భార్య.

''నువ్వు కాదే పిచ్చిమొహమా! నేను తాగడంవల్ల నువ్వు అందంగా కనిపిస్తున్నావు?''

-శ్రీనివాస్ వల్లాల (నారాయణఖేడ్)

## ఎలా నచ్చావు?

''పెళ్లి చూపుల్లో అతనడిగిన ఏ ప్రశ్నకీ నువ్వు సమాధానం చెప్పలేదు కదా. అయినా నువ్వెలా నచ్చావు?'' ఆశ్చర్యం వ్యక్తం చేసింది రాధిక.

''అతను లైబ్రేరియన్'' సిగ్గుతో చెప్పింది కమల.

## సమస్య

''మా ఆయన హిప్నాటిస్ట్ అవడం పెద్ద సమస్య అయిందే'' విచారంగా అంది రాధ.

''ఏం?'' అడిగింది మాలతి.

''నేను పోపుల డబ్బాలో డబ్బు దాచుకున్న విషయం నన్ను హిప్నటైజ్ చేసి చెప్పించి తీసేసుకున్నారు.''

-ప్రతాప వెంకట సుబ్బారాయుడు (జె.జె.నగర్)

## స్థితప్రజ్ఞత

సురేష్, వెంకట్ బార్లో మాట్లాడుకుంటున్నారు.

''స్థితప్రజ్ఞత అనే పదం ఈరోజు విన్నాను. దాని అర్థం ఏమిటో తెలుసా నీకు?'' అడిగాడు సురేష్.

''మనం మూడో పెగ్గు తాగిన తరువాత ప్రశాంతంగా అందరితోనూ ఆప్యాయంగా మాట్లాడతామే. దాన్నే స్థితప్రజ్ఞత అంటారు'' వివరించాడు వెంకట్.

- వి.వ్యామ్‌కుమార్ (బీదర్)




కుంటుందని బయటకు దుఃఖాన్ని కనబడనీయ లేదు.

ఏం చేయాలా అని ఆలోచిస్తున్నాడు. కాసేపటి తరువాత ఒక నిర్ణయానికి వచ్చి ఫోన్ అందుకున్నాడు.

తన సినిమాలకి స్టంట్ కంపోజ్ చేసే ఫైట్ మాస్టర్ రసూల్‌ని అర్జంటుగా రమ్మని చెప్పాడు.

ఈ సమయంలో అదే సరైన నిర్ణయం.

పోలీస్ కంప్లైంట్ ఇస్తే అంతా నానా రభస అవుతుంది.

ఇక దాన్ని విలేకరులు చాలా అస్తవ్యస్తంగా చిత్రీకరించి మరింతగా వక్రీకరించి రాస్తారు.

ఒక పావుగంటలో రసూల్ వచ్చి రాణా ముందు నిలబడ్డాడు.

రాణా విషయమంతా చెప్పాడు.

''రసూల్ భాయ్! ఈ సహాయం చేయ్. ఎల్లాగైనా వెదికి అమ్మాయిని పట్టుకురా. వీలయితే ఆ అబ్బాయికి నాలుగు తగిలించండి.''

''అలాగే బాస్! ఇక మీరు నిశ్చింతగా ఉండండి. మా కుర్రాళ్లని పంపించి మొత్తం నగరమంతా గాలించి ఎల్లాగైనా అమ్మాయిని తీసుకొచ్చే బాధ్యత నాది'' రసూల్ హామీ ఇచ్చాడు.

''ఈ విషయం మన రంగంలో ఎవరికీ తెలీకూడదు జాగ్రత్త. మీ కుర్రాళ్ళకి కూడా గట్టిగా వార్నింగ్ ఇచ్చి చెప్పు.''

''ఒకవేళ ఈ విషయం బయటకు వస్తే అది నేను చెప్పినట్టే అనుకోండి సరేనా'' రసూల్ గట్టి భరోసా ఇచ్చాడు.

రసూల్ వెళ్లిన తరువాత మళ్లా సోఫాలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు.

అంజనీ మౌనరోదన తనకు మరింతగా ధైర్యాన్ని సడలిస్తోంది.

అందుకే లేచి తన గదిలోనికి వెళ్ళి బెడ్‌మీద కూర్చున్నాడు.

రసూల్ అంటే తనకి చాలా నమ్మకం.

అందులోనూ తను కొద్దిగా చనువుగా కలసి తిరిగేది రసూల్‌తోనే.

అమ్మాయికి రసూల్ బాగా తెలుసు. అంకుల్ అని పిలుస్తూ చనువుగా ఉండేది. అందుకే ఈ పనిని రసూల్‌కి అప్పగించాడు.

తనకి ఒక్కర్తే కూతురు. చాలా గారాబంగా ముద్దుగా పెంచారు.

తను ఈ సినిమా ఫీల్డులో చాలా బిజీ. కూతురు విషయం పట్టించుకోలేదు.

కానీ లహరి చాలా తెలివైన పిల్ల. చిన్నప్పటి ... మాటలు వింటుంటే చాలా నవ్వొచ్చేది. పెద్ద ... దలా మాట్లాడేది.

ప్రతి క్లాస్‌లోనూ అదే ఫస్ట్. సొంతంగా ... చదువుకుంటుందికదా అని తనే పట్టించుకోలే... అంజనీ అన్ని విషయాలు చూసుకుంటుంది... లేసాడు. అదే ఈ రోజు ఇంతవరకూ లాక్కొచ్చింది. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకుని లాభం ఏమిటి?

రసూల్ చెప్పినట్లుగానే మరుసటిరోజు సాయంత్రానికి లహరిని తీసుకొచ్చాడు.

''బాస్! అమ్మాయి బిర్లా టెంపుల్ దగ్గర కన్పించింది. వెంటనే పట్టుకుని తీసుకొచ్చాను. ఆ అబ్బాయి చుట్టుపక్కల ఎక్కడా కనబడలేదు. అమ్మాయిని అడిగినా చెప్పలేదు. బహుశా మమ్మల్ని చూసి పారిపోయి ఉండొచ్చు.''

రసూల్‌ని వెళ్లిపొమ్మని సైగ చేసాడు కళ్లతోనే థాంక్స్ చెప్పి.

అమ్మాయిని చూడగానే అంజనీ వెళ్లి గాఢంగా కౌగలించుకుని మళ్ళీ భోరున ఏడ్చింది.

అమ్మాయి ఈ రెండురోజుల్లోనే పీక్కుపోయినట్లుగా కన్పించింది.

అమ్మాయిని అలా చూసేసరికి హృదయంలో గూడుకట్టుకున్న బాధంతా కరిగి కన్నీరుగా మారి కళ్లల్లోంచి బయటకొస్తోంది.

''ఎందుకమ్మా ఇలా చేసావు?'' డగ్గుత్తికతో అడిగాడు.

''నేను అతడ్ని ఇష్టపడ్డాను డాడీ! అందుకే...'' లహరి నెమ్మదిగా చెప్పింది.

''నీ పెళ్లి ఎంతో ఘనంగా చేద్దామనుకున్నాను. ఒక మంచి పెద్ద సంబంధం చూద్దామని ప్రయత్నాలు కూడా చేస్తున్నాను. కానీ నువ్వు ఇలా...''

''ఇంక వద్దు డాడీ. నేను ఆ అబ్బాయితోనే వుంటాను. మేమిద్దరం ఒకరినొకరు బాగా ఇష్టపడ్డాం.''

''అదంతా ప్రేమకాదు, వయసులో కలిగే ఆకర్షణ అంతే. ఆ అబ్బాయిని మర్చిపో.''

''డాడీ మీరు ఇలా మాట్లాడడం బాగాలేదు. ఇంకా మీరు మా ఇద్దరి విషయాలు తెలుసుకున్న తరువాత పరిశ్రమలో అందర్నీ పిలిచి ఘనంగా పెళ్లి చేస్తారేమో అనుకుంటున్నాం. ఎందుకంటే మీ సినిమాలన్నీ ప్రేమమయంకదా!''

''అది సినిమా. ఇది నిజ జీవితం. దానికీ దీనికీ ఎక్కడా పొంతన లేదు'' ఖచ్చితంగా చెప్పాడు.

''కానీ... ఎంత తేలిగ్గా చెప్పారు డాడీ. మీ సినిమాలు చూసి ప్రేరణ పొంది ఎన్నో ప్రేమ జంటలు ఒకటయ్యాయి. ఇంకా ప్రేమ ఫలించలేని జంటలు ఆత్మహత్యలు చేసుకున్నారు. అంతకుమించి ఎందరో కన్న తల్లిదండ్రులు తమ పిల్లలు ... ప్రేమ పేరుతో తమపై ఎదురు తిరగ...

చలేక గుండె క్షోభతో చనిపోయారు. మీ సినిమాలవలన యువతకి ప్రేమ వైరస్ సోకింది. క్లాసులు ఎగ్గొట్టి జంటలుగా తిరుగుళ్ళు ప్రారంభించారు ప్రేమ పేరుతో. వాళ్లందరికీ మీ సినిమాలే స్ఫూర్తి'' తలెత్తి తండ్రివైపు చూసింది.

''అదంతా వాళ్ళ ఖర్మ'' చిరాగ్గా చెప్పాడు.

''కీర్తి కాంక్షతో ట్రెండ్ సెట్టింగ్ కోసం మీరు అడ్డమైన సినిమాలు తీసారు. ఆ విషయం వాళ్ళు తెలుసుకోలేకపోయారు. ఈరోజు మీ కూతురు లవ్ మ్యారేజ్ చేసుకునేసరికి భరించలేకపోయారు. ఇలాగే...మీలాగే క్షోభతో చిక్కిశల్యమై శవాలైపోయారు ఎందరో తల్లిదండ్రులు. ఎక్కడ చూసినా ఇప్పుడు మైనర్ ప్రేమికులే. హైస్కూల్ అమ్మాయికి కాలేజీ అబ్బాయికి మధ్య ప్రేమ. ఇదంతా మీ ప్రేరణే'' ఏడుస్తూ చెబుతోంది.

''మా స్నేహితురాలు శ్రావణి తెలుసుకదా నాన్నా! తను ఇలాగే ఒక అబ్బాయిని ప్రేమించింది. ప్రేమ పేరు చెప్పి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసాడు. అప్పటికే తను ప్రెగ్నెంట్ అయింది. ఇంట్లో విషయం చెప్పలేక చివరికి ఆత్మహత్య చేసుకుంది. తను ఎప్పుడూ మీ గురించే చెప్పేది. మీ సినిమాల గురించే మాట్లాడేది. ఒక విధంగా మీ అభిమాని.''

లహరి మాటలు వింటుంటే ఎంత ఎత్తుకు ఎదిగిపోయిందా అనిపించింది. ఆకాశం ఎత్తుకు ఎదిగిన లహరిని చూడడానికి కూడా సిగ్గుపడి తల దించుకున్నాడు.

అప్పుడు ఆలోచించాడు తన సినిమాలను ఎవరూ ఇంతవరకూ ఇలా విమర్శించలేదు. చిన్నదయినా సూటిగా చెప్పింది.

లహరి చెప్పింది నిజమనిపించింది.

పూర్వం ప్రింట్ మీడియా రాజ్యమేలే రోజుల్లో జనాలందరూ రిలాక్స్ కోసం, ఎంటర్‌టైన్‌మెంట్ కోసం సినిమాలకి వెళ్లేవారు అప్పుడప్పుడు.

ఆ రోజుల్లో అన్నిరకాల సినిమాలు వచ్చేవి. జానపదం, పౌరాణికం, ఫాంటసీ, లవ్, ఆఫ్ బీట్...ఇలా!

కానీ ఇప్పుడు మాత్రం కేవలం లవ్ మాత్రమే. అదే సబ్జెక్ట్.

ఏ సినిమాలోనూ నీతిలేదు. యూత్ పేరుతో అన్నీ బూతు సినిమాలే.

శాటిలైట్ ఛానళ్ళతో విసుగుచెంది కనీసం సినిమాకి వెళదామన్నా అక్కడా ఇదే బాధ.

సాహిత్యసుమాలు గుభాళించే ఆ రోజుల్లో చెత్త సాహిత్యం వచ్చేది. కానీ ఆదరణ మాత్రం ఎప్పుడూ మంచి సాహిత్యానికే ఉండేది. ఇప్పటికీ అదే ఆదరణ. కానీ ఇప్పుడు ఈ తరంలో చెత్త, అశ్లీల సినిమాలకే ఆదరణ ఎక్కువవుతోంది. ఎంత మార్పు!

జనం ఆదరించడంలేదని కేవలం ప్రేమ సినిమాలే తీస్తున్నారు. ఈ తరం యువతకు జానపదం, పౌరాణికం లాంటివి తెలీదు. ప్రజలు ఆదరించడం లేదన్నది కేవలం అపోహ. అసలు జనాల్ని అలా మార్చింది తామే.

''డాడీ! మావి చాలా లేత హృదయాలు. ఈ వయసులో ఏ విషయమైనా మాలో గాఢంగా ముద్ర వేస్తుంది. మీ సినిమాలు చూసి ప్రేమలో ఏదో హాయి ఉందని అటువైపు తిరిగారు. యువతరం పాడైపోతే దేశ భవిష్యత్తే నాశనం అవుతుంది. లవ్ సినిమాలు తీయండి. కాదనడంలేదు. కానీ దానితోపాటే కెరీర్ డెవలప్‌మెంట్ కోసం చెప్పండి. జీవితం గొప్పతనం వివరించండి. ప్రేమ కేవలం జీవితంలో ఒక భాగమని చెప్పండి. ప్రేమే జీవితమని బోధించకండి. సాంప్రదాయాల్ని కాపాడండి. హిందూ ధర్మాల్ని రక్షించండి'' కాసేపు ఆగింది.

''డాడీ! మీకో నిజం చెబుతున్నాను. నేను ఎవరినీ ప్రేమించలేదు. నా ఫ్రెండ్ చంద్రలత నేనూ కలసి చేసిన పని ఇది. చంద్రం అంటే అదే. మా స్నేహితురాలు శ్రావణి ఆత్మహత్య చేసుకున్న తర్వాత మేమిద్దరం చాలా అప్‌సెట్ అయ్యాం. మీకు ఎలాగైనా నిజం చెప్పి మీతో మంచి సిన్మాలు తీయించాలనే ఇలా చేసాం. పాడైపోతున్న యువతరాన్ని మీరే మార్చండి. అది మళ్ళీ మీ సినిమాలవల్లనే సాధ్యం. అదొక శక్తివంతమైన మీడియా! యువతకు కనువిప్పు కలిగించండి. ఈ ప్రేమ వైరస్‌కి మళ్లీ మీరే సినిమాల ద్వారా ట్రీట్‌మెంట్ ఇవ్వండి'' కన్నీళ్ళతో ఏడుస్తూ చెబుతోంది.

లహరి దగ్గరకి వెళ్లి నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాడు.

కన్న తల్లిదండ్రుల క్షోభ తెలిసింది. కటిక నిజం కళ్లముందు కదిలింది.

కర్తవ్యం గుర్తుకొచ్చింది. ఒక స్థిర నిర్ణయానికి వచ్చాడు.

''బేబీ! ఇక నువ్వు చెప్పినట్లుగానే సినిమాలు తీస్తాను. యువతను మేల్కొలుపుతాను. ఇప్పుడు తీస్తున్న సినిమా క్లైమాక్స్‌కొచ్చింది. ఈ కథకి కొత్త ముగింపు ఇస్తాను. ఈ విషయంలో అపజయాలు ఎదురైనా వెనక్కి తిరిగి చూసే ప్రసక్తిలేదు'' రాణా మాటల్లో దృఢత్వం వుంది.


లహరి చేతిని అందుకుని తను ప్రామిస్ చేసాడు.

అదే లహరి కోరుకునేది. మళ్లీ కళ్లల్లో కన్నీళ్ళు చిప్పిల్లాయి.

అవి బాధతో వచ్చిన కన్నీళ్ళు కావు. తన తండ్రిలో వచ్చిన మార్పు చూసి వచ్చిన ఆనందభాష్పాలు!

★

## లేజర్‌తో కొత్త ఉపయోగాలు



లేజర్‌ను ఎన్ని రంగాలలో ఎన్ని రూపాలలో ఎన్ని విధాలుగా ఉపయోగిస్తున్నారో మనకు తెలియని విషయంకాదు. ఇటీవల కొందరు అమెరికన్ పరిశోధకులు లేజర్‌ను ఓ సరికొత్త పనికి ఉపయోగించడంలో సఫలీకృతులయ్యారు. ఆర్కియాలజికల్ వారి త్రవ్వకాలలో అతి ప్రాచీనకాలానికి సంబంధించిన పలు వస్తువులు, నాణేలు, బొమ్మలు, చిత్రపటాలు, శిలాఫలకాలు లభిస్తుంటాయి. ఎంతోకాలంగా భూమిలో ఉన్న వీటిని పరిశుభ్రపరిచి వాటి అసలు రూపం చూడాలంటే, పలువిధాలైన పద్ధతుల్ని ఉపయోగించకతప్పదు. ఎన్నో రకాల రసాయనాలను ఉపయోగించి వీటిని శుభ్రపరిచేటపుడు కొన్ని కొన్ని సందర్భాలలో వీటి అసలు రూపానికే హాని కలిగే అవకాశం కూడా వుంది. ఇలాంటి సందర్భంలో వీటికెలాంటి హాని కలగకుండా దుమ్ము, ధూళితో నిండిన వీటిని లేజర్‌తో పరిశుభ్రపరచవచ్చునని ప్రయోగాపూర్వకంగా ఋజువుచేసి చూపారు పరిశోధకులు.

## మెదడుకు పని ఒత్తిడి

ప్రపంచం మొత్తం ప్రస్తుతం ఉన్న ప్రజలందరికీ ఒక్కొక్కరికీ రెండు టెలిఫోన్స్ చొప్పున ఏర్పాటుచేసి ఆ టెలిఫోన్స్ మొత్తాన్ని ఒకే ఎక్స్ఛేంజ్ ద్వారా ఏర్పాటు చేసినపుడు ఆ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఎలా ఉంటుందో, బిలియన్ సంఖ్యలో పనిచేసే ఆ ఫోన్‌లన్నింటినీ సక్రమంగా పనిచేసేలా చూడటానికి, కరెక్టుగా వారందరికీ బిల్స్ పంపటానికి, వాటికి వచ్చే సమస్యల్ని సత్వరం పరిష్కరించటానికి, ఆ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో ఎంత పని ఒత్తిడి అయితే ఉంటుందో- ఎటువంటి టెన్షన్సూ లేని ఒక సాధారణ వ్యక్తి యొక్క మెదడుకు అంతకన్నా పదిరెట్లు పని ఒత్తిడి ఉంటుంది. ఇక మీ బ్రెయిన్‌ను టెన్షన్‌లో పెట్టారా దాని పని సామర్థ్యం మరో పందిరెట్లు పెరుగుతుంది. వామ్మో అనేశారా?!

- భూక్యా గోపీనాయక్

